
# సాత్రీభాయి

## కాళ్ళకూరి శేషగిరిరావు

*ప్రతికారం నాది—అన్నాడు క్రీస్తు భగవానుడు. ఉత్తముడు ప్రతికారం తలపెట్టడని రామాయణం చెబుతున్నది. దానితో పరిష్కారమయ్యే దేమీలేదు.*

ఏపుగా, గుబురుగా పెరిగిన బుడంచేల మధ్య నుండి, గతుకుల మీదుగా దూసుకుంటూ పోతూంది సవారీ బండి. మువ్వల గణగణలు, కీచురాళ్ల రణగొణధ్వనితో శ్రుతి కలుపుతున్నాయి. మసక వెలుగునిచ్చే దివిటీలు పట్టుకుని వగుర్చుకుంటూ పరుగిడుతున్నారు జమీందారుగారి పరిచారకులు. మస్తుగా తిన్న ఆహారాన్ని జీర్ణించుకుంటూ కొండచిలువలుచేసే రోదన ధ్వనీ, నోటికి అందీ అందకుండా పారిపోయిన ఆహారాన్ని తలచుకుంటూ కోపఘూర్ణితంగా చేసే మెకాల గర్జనలూ ఉండి ఉండి లీలగా చెవుల కొనుతున్నాయి. ఈ కాళరాత్రిని, దగ్గర పడుతున్న ఆ జీర్ణ మందిరంలో ఎలా గడపడమా అని భీత చిత్తంతో ఊహిస్తూ, కనులుమూస్తూ, తెరుస్తూ, బండిలోని పట్టు మెత్తపై కునికిపాట్లు పడుతున్నారు జమీందారుచిన్న వెంకన్నదొరగారు.

తూర్పు గోదావరి జిల్లాలోని యల్లవరం మన్యాల విశాల ప్రాంతంలో ఒక మారుమూల



ప్రదేశ మది. బండి వెడుతున్న మట్టిబాట వెంబడి ఇంకో రెండు మైళ్ళు గడిస్తే, చీకటిచాటున పెద్ద భూతంలా అడ్డు నిలుస్తుంది ఒక బ్రహ్మాండమైన మందిరం. పెద్ద వెంకన్న దొరగారు తన చిన్నతనంలోనే తన తల్లి స్మారకార్థం కట్టించిన భవంతి అది. ఆయనే దానికి మాతృఛాయ అని నామకరణం చేశారు. దాదాపు ఏభై ఏళ్లపాటు మహావైభవంలో మునిగి తేలిన 'మాతృఛాయ' లో నేడు ఛాయామాత్రంగానైనా ఆ వైభవంలేదు. తన జమీందారీలోని భూములు చాలా అక్కడ ఉండడం వల్లనైతేనేం, కీకారణ్యపు వింత ప్రకృతిని ఆస్వాదించే నిమిత్తం అయితేనేం, తన తల్లికి ఇష్టమైన ప్రదేశం కావడంచేతనైతేనేం పెద్ద వెంకన్న దొరగారు ప్రతిఏటా కనీసం నాలుగు నెలలైనా ఆ భవంతిలో నివసిస్తూఉండేవారు. ఆయన అనంతరం చిన్న వెంకన్నదొరగారు రెండు మూడేళ్లదాకా అక్కడకు రాకపోయినా, ఆయన తల్లి అక్కడే ఉండడంవల్ల ఆ భవంతి వైభవం పెరిగింది. ఆ తర్వాత ఆమె అక్కడే సమాధి చెందడం, ఆమె అంత్యక్రియలకోసం చిన్న వెంకన్న దొరగారు అక్కడికి వచ్చి ఒకవారం మకాం పెట్టడం జరిగింది. ఆ తర్వాత, ఆ ఇంట్లోనే ఒక భీషణ సంఘటన జరగడం, రాత్రికిరాత్రి జమీందారుగారు ఆ భవంతి వదిలి వెళ్లిపోవడం జరిగింది. అప్పటినుంచీ ఆ భవంతి పాడుపెట్టబడింది. తిరిగి ఆ భవంతికేసి కన్నైనా వేయడానికి ధైర్యం చాలలేదు జమీందారు వారికి. అప్పటినుంచీ 'మాతృఛాయ' దాదాపు భూతఛాయగానే ఉండిపోయింది. వేటకోసం వచ్చే దొడ్డదొరలైనా ఆ ఇల్లు చొరడానికి ధైర్యం చేయలేక పోయారు. క్రమక్రమంగా ఆకసాన్నంటే కోటగోడలు కూలిపోయినాయి. ఇల్లంతా పిచ్చి మొక్కల కాలవాలమైపోయింది. మాతృఛాయ శిథిలావస్థకు లోబడిపోయింది.

తిరిగి ఇరవై సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయాక ఈనాడు, దడదడలాడే హృదయంతో ఆ ఇంటికేసి పయనమవుతున్నారు చిన్న వెంకన్న దొరగారు. కనీసం రెండేళ్లనుంచీ వాయిదా వేస్తున్నా, పరిస్థితుల ప్రాబల్యంవల్ల,వ్యవహారాల అవశ్యంవల్ల ఆయన ఇక్కడికి రావడం తప్పలేదు. అప్పటికీ వీలైతే సాయంత్రంలోగా పనిని పూర్తి చేసి రాత్రికల్లా మకాం ఎత్తేద్దామనుకుని కాకినాడలో పెందరాళే బయలుదేరినా, దారిలో కారు చెడడంవల్లనైతేనేం, బురదబాటపై సవారీ బండి తేవతేవకూ కూరుకుపోవడం వల్లనైతేనేం ఇంకా మాతృఛాయ సమీపానికి రాకుండానే చీకటి అవతరించింది. బయట చీకటి, గుండెల్లో చీకటి. కాగడాల గుడ్డివెలుగు ఆయనలో భయాన్ని రెచ్చగొడుతూంది. తూగిపోయే మనసుతో, బలిపీఠానికి వెళ్లుతున్న యజ్ఞ పశువులా, పట్టు పరుపుపై గిలగిల్లాడుతూ పయనిస్తున్నారు జమీందారుగారు.

చివరకు ప్రయాణం ఆఖరైంది. జీభూతంలా మెరుస్తున్న జీర్ణ భవన ప్రాంగణాన సవారిబండి ఆగింది. బండితోలిన బాపనయ్య ఒక పెట్టెను భూమికురికి, "అక్కడే కూర్చుని ఉండండి దొరా. దీపం తెస్తా" అంటూ, ఆ ప్రక్కనే ఉన్న తన గుడిసెలోకి పరుగెత్తాడు. ప్రస్తుతం అప్రాంతాల భూములన్నీ బాపనయ్యకవులుక్రిందే ఉన్నాయి. మాతృఛాయ భవనానికి అతనే యజమాని. కాని అతను ఒక్కక్షణమైనా అయింట్లో గడిపినట్లు రుజూలేదు. అయితే భవనం ఎంత హీనదశలో ఉన్నా ఒక్కగదిమాత్రం ఎల్లప్పుడూ నివాసయోగ్యంగా ఉంచేవాడు, ఏనాటికైనా అవసరం వస్తుందని. అతను గుడిసెలోకి పరుగిడుతూనే "మల్లీ, మల్లీ, దొరగారొచ్చేశారు. దీపం ఇచ్చి తిండీ అదీ సిద్ధంచెయ్యి" అని అరిచాడు."

ఓ! వస్తున్నా, మావా" అంటూ వయ్యారం ఒలకబోసుకుంటూ వచ్చింది అతని భార్య మల్లి, దీపం చేత్తో తీసుకుని.

"ఏం మావా, ఎలాఉన్నారు దొరగారు?" అని ప్రశ్నించింది వస్తూనే.

"ఓ. బాగానే ఉన్నారు. వారికేం, నిక్షేపం! అయినా నీకేం జ్ఞాపకం ఉంటుంది? ఇరవై ఏళ్లక్రితం చిన్న పిల్లవికదూ" అంటూ దీపం తీసుకుని ఇవతలకు వచ్చాడు.

అప్పటికే చిన్న వెంకన్నదొరగారు బండిదిగి కాగడాల వెలుగులో పెళ్లలూడిన మెట్ల మీదుగా భవనప్రవేశంచేసి, బెబ్బులిని చూస్తున్న లేడిపిల్లలా, నూతనాలంకారాలతో శోభిల్లుతూ లీలగా కనిపిస్తున్న నట్టింటికేసి చూస్తూ నించుని ఉన్నారు. ఇరవై సంవత్సరాలు ఇరవైయుగాలుగా నత్తలా ప్రాకుతూ కాలసముద్రంలో అంతమైపోయినాయి. ఎన్నో గోతులను పూడ్చివేసినాయి. ఎన్నో మలినాలను కడిగివేసినాయి. కాని తన హృదయంలో రేగిన పుండునుఏమాత్రం పచ్చికూడా వదిలించలేక పోయినాయి. సరిగ్గా ఇరవైఏళ్లనాడు, ఇదేకాళరాత్రి, ఇదే విశాల భవంతి, ఇదేనట్టిల్లు, ఒక ఘోరమైన, ఒక అమానుషమైన చర్యకు మూగపోయిన సాక్షుల్లా నిలబడి ఉన్నాయి.

అప్పటికి తన వయస్సు పాతిక. కండలు తిరిగిన శరీరం, బండబారిన హృదయం, విర్రవీగిన మనస్సు, మదమెక్కిన ఏనుగలా, యదలోని ఆంబోతులా, ఉండేవాడు, తను. ఛాతీ విరుచుకు నడుస్తూఉంటే వయసుగత్తెలంతా వికావికలై పారిపోతూ ఉండేవారు. ఆ పారిపోతూన్న పడుచుల్లో ఎవరికూపో తన మనస్సుకు నచ్చేది. ఆ వనిత పుల్లయ్య కూతురవనీ, ఎల్లయ్య కోడలవనీ, మల్లయ్య భార్య అవనీ ఆరాత్రికి తనవశం కావలసిందే. లేకపోతే ఆ కుటుంబం సర్వనాశనమే. ఎవరు ఎన్ని చెప్పినా, ఎన్నిచేసినా వినేవాడుకాదు. నీతిని అవినీతిలోనే నడిపించేవాడు. ధనమదాంధతతో, పదవీగర్వంతో తను చేయని అత్యాచారంలేదు. ఎన్నో కుటుంబాలు నట్టేట్లో కలిసిపోయినాయి. తనుమాత్రం చెక్కుచెదరక


"ఆధునిక చికిత్స"
వైద్యులే కాక, ఇతరులు కూడా చదివి అర్థం చేసుకొనగల సులభశైలిలో 3 భాగములుగా వ్రాయబడినది. ప్రతి వైద్యుడు, వైద్య విద్యార్థి చదువవలసినది. ఆయుర్వేద, అలోపతి, సిద్ధాంతముల చికిత్స, విదాన, విధానములు గలవు. గ్రామ వైద్యులకు పెన్నిధి.
మొదటి భాగం రూ. 5, రెండవభాగం రూ. 6, మూడవభాగం రూ. 10. పోస్టేజి అదనం.
ఇండియన్ మెడిసన్ హౌస్,
విజయవాడ — 2.

నెలకు రు. 200 సంపాదించండి
ఎలెక్ట్రిక్ అండ్ రేడియో గైడ్
ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్, రేడియో రిపేరింగ్, రేడియో మెకానిజం, హోం వైరింగ్ గురించిన పూర్తి కోర్సు ఇంటివద్ద నేర్చుకొనండి. రు. 50/—లకు ఇంటివద్ద ట్రాన్సిస్టర్ రేడియో తయారుచేయడం కూడ నేర్చుకొనవచ్చును. 987 చిత్రములు. ధర రు. 10/— వి. పి. పి. చార్జీలు రు. 2/—.
మీ ఆర్డర్లకు ఇంగ్లీషులో వ్రాయండి.
KUBER & CO. (A. 10)
P. O. Box No. 1268—Delhi-6.



# 'నేను...'

వి. నాగగోపాల్

నేను
ఉదయభానుకిరణాలపై పయనిస్తాను
గర్వంతో విఱ్ఱవీగుతూ,
ఉత్తుంగ తరంగతురంగాలపై ఉయ్యాలలూగుతూ
సయ్యాటలాడుతాను,
అలసిపోతాను,
అలసిసొలసి సొమ్మసిల్లి
ఆ పద్మగర్భంలో నిదురిస్తాను
తీయగా, హాయిగా,
చిరుగాలిదొంతర్లపై దొర్లిపోతాను
చిగురాకునై,
హృద్యమైన కోకిలగానంలో కరగిపోతాను
హిమకబిందువువలె,
పోతా నైక్యమై ప్రకృతితో!

## మాతృఛాయ

అలాగే అక్రమాల రుధిరంలో చేయి కడుక్కునే వాడు.

ఆ మరపురాని రాత్రి. అప్పటికి వారంరోజుల నుండీ మాతృఛాయలో నట్టడవిలో ఎడారిజీవితం గడుపుతున్నాడు. మనసంతా వెర్రి కోర్కెలతో నిండిపోయి ఉంది. రోజంతా ముళ్లపందుల్నీ, దుప్పుల్నీ వేటాడి అలసి వస్తూంటే, ఖామందు సుబ్బయ్య ఇంట్లోకి కంగారుగా మాయమవు తున్న మెరుపుతీగె కళ్లకు తళుక్కు మంది. వెంటనే ప్రక్కనున్న నరసింహాయికి కనుసైగ అందింది. "లాభం లేద్దొరా! అది సుబ్బయ్య భార్య. ఆరేళ్ల బిడ్డ తల్లి" అన్నాడు నరసింహాయి. కైపెక్కిన మెదడులోకి అతని వచనాలు ప్రవే శించనే లేదు. తనకళ్లలోని నెత్తురు జీరను చూసిచూసి వెనక్కు తిరిగాడు నరసింహాయి. జిమ్ముమంటూ అడవి చీకటైపోయింది. పందిరి పట్టె మంచంమీద మొఖమల్ పరుపుపై పవ ళించి, కస్తూరితమలం నములుతూ నూకాలు రాకకు ఎదురు చూస్తున్న తన కళ్లముందు, సుబ్బయ్య ప్రత్యక్షమైనాడు, "ఎందుకో పిలిపించారుట దొరా" అంటూ.

"నిన్ను కాదయ్యా!" వెర్రి నవ్వులో వికారంగా వెటకారంగా అన్నాడు.

"తెలుసు, నూకాల్నిట. కారణం?"

సుబ్బయ్య కంఠంలోని తీక్ష్ణతకు తన నవ నాడులూ ఉప్పొంగినాయి. ముళ్లపందుల రక్తంలో స్నానమాడిన తన తుపాకీ కేసి ఆప్యాయంగా చూస్తూ, " నా లాంటి మగాడు ఆడదాన్ని ఎందుకు పిలిస్తాడనుకున్నావ్?" అన్నాడు అదే పొగరుతో, అదేహేళనతో.

"తమరు దొడ్డ ప్రభువు లయితే అవవచ్చు గాక. ఇలాంటి తప్పుడు కూతలు కూయకండి. నేను మీకు దాసుణ్ణయినంత మాత్రాన మా నీతి చావలేదు. ఇంకెప్పుడూ ఇలాంటి ఊసెత్తక మర్యాదగా పడుకోండి. మర్యాదగా మసలుకోండి. మీ మర్యాదను కాపాడుకోండి" అని అతి తీవ్రంగా జవాబుచెప్పి వెనుతిరిగాడు సుబ్బయ్య.

వేడిరక్తపు ఉద్రేకం ఉప్పొంగింది. భూమి దద్దరిల్లేలా తుపాకీ రెండుసార్లు ప్రేలింది.

"అమ్మా!" అని అరుస్తూ, మాతృఛాయా భవనంలో తన మాతృఛాయలో కలిసిపోయాడు సుబ్బయ్య.

"చంపేశారు. నా సర్వస్వాన్నీ నాశనం చేసేశారు" అని అరుస్తూ, ఏడుస్తూ, పరుగెత్తుకు వచ్చిన నూకాలు తన భర్త దేహంమీద పడకుండానే తన చేతుల్లోకి లాక్కొన్నాడు. కహాకహా ధ్వనులతో రాయిలాంటి తలుపులు మూసుకుపోయినాయి. నూకాలు కళ్ల లోంచి ధారగా ప్రవహిస్తున్న కన్నీరు ఒక్క క్షణంలో లావాద్రవంగా మారిపోయింది.

"నా బిడ్డను అనాధ చేస్తున్నావే అనే కోపం తక్క నా కింకేదీలేదు. నేనుపిశాచాన్నై నానరేనిన్ను పిప్పిచేసుకొని తింటా. నీ కామం తీర్చుకుంటావా? ఇదుగో తీర్చుకో" అంటూ పిట్టలా తన చేతు ల్లోంచి దూసుకొని కఠినమైన గోడకు కొట్టు కుంది. ఆమె తల ఛిన్నాభిన్నమైపోయింది. ఆమె మెత్తని మెదడు హాయుంగా, పేయుంగా తనకాళ్ళ ముందు పారాడింది. ఎదురు చూడని, ఎప్పుడూ జరగని ఈ సంఘటనకు రాయిలాంటి గుండె వెన్నెలా కరిగిపోయింది. అప్పటికప్పుడే ఆ భవం తిని విడిచి వచ్చేశాడు. డబ్బు వెదజల్లి తన నేరాన్ని కప్పిపుచ్చుకోగలిగాడు. నోళ్లు మూయిం చాడు. కాని ఆ సంఘటన తన జీవితపు బాటను పూర్తిగా మార్చి దిద్దివేసింది. మాయని మచ్చలా, పచ్చిపుండులా తన హృదయంలో తిష్ఠ వేసుకుంది. మళ్లీ ఇన్నాళ్లదాకా ఆ ఇంటికేసి తనదృష్టిని మరల్చలేకపోయింది. వైభవం తొణి కిసలాడే ఆ భవనాన్ని జీర్ణింపచేసే ఒక దయ్యాల కొంపలా తయారు చేసింది. ఇరవై ఏళ్ల తర్వాత ఆ నట్టింటిని శూన్య దృక్కులతో చూస్తూ గతించిన ఆ సంఘటనల ఆలోచనల రంపపుకోతలో సతమతమైపోతున్నా డతను.

బాపనయ్య చేతిలోని దీపపుకాంతి ఆ నట్టిం టిని మళ్లీ వెలిగించింది. ఆ గదిలోని బీభత్స దృశ్యమంతా మటుమాయమైనా, దీపపుకాంతిలో వంకర తిరిగిన క్రీనీడలు తనహృదయాన్ని కలచి వేస్తున్నాయి. ఈ గదిలో ఈ ఘోరమైన చీకటిరాత్రి ఎలాగడుస్తుందా అని హడలిపోతున్నా డతను. ఆయన మనసులో భీతిప్రవృత్తి ముఖంలో ప్రస్ఫుటంగా ప్రతిబింబిస్తూనే ఉంది.

"ఏం దొరా! కండలు తిరిగినబంట్లు, మీరు ఈ గదిలో రాత్రిగడపడానికి భయపడుతున్నారా, ఏం?" అని హేళనగా ప్రశ్నించాడు బాపనయ్య.

"ఏం దొరా!" అని ఆశ్చర్యంగా రెట్టించాయి పరిచారక కంఠాలు.

హృదయమాలిన్యం కప్పిపుచ్చుతూ, "అబ్బే, లేదు" అని మొండి ధైర్యంతో జవాబు చెబుతూ దడదడలాడే గుండెను అరచేతితో హత్తుకొని ఠీవిగా లోపలకు అడుగుపెట్టారు చిన్న వెంకన్న దొరగారు.

సన్నబియ్యంతో, లేతకోడిపిల్లతో చవులూరు తున్న పులావు కమ్మగా కడుపార భోజనంచేసి, తెల్లగా పక్కవేసిన బూరుగుదూది పరుపుమీద మేనువాల్చారు జమీందారుగారు. "ఏం భయ పడకండి, దొరా. మేమంతా ఈ పక్కనే అరుగు మీద పడుకుంటాం"అని హెచ్చరించి బాపనయ్య, పరిచారకులు ఇవతలికి వచ్చేశారు. సున్నపు పెళ్లలు ఊడినగోడలు మత్తెక్కిన మనసులో వక్రమైన నీడలు సృష్టిస్తూఉంటే, మైకంక్రమ్మిన ఆయో

మయంలో ఏట్రిస్తూ, భయపడుతూ, తల్లడిల్లుతూ వెర్రి ఊహలతో బలవంతంగా కళ్లు మూసుకున్నారు జమీందారుగారు.

కోడెత్రాచుకు చిక్కిన కప్పపిల్ల బెకబెకమంటూ గింజుకుంది. వికారంగా కూత వేస్తూ గుడ్లగూబ చిట్టెలుకను సందిట్లో చేర్చుకుంది. మమతలు తీరని ప్రేతాత్మలు పిశాచరూపాలలో నిశ్శబ్దంగా వికటాట్టహాసం చేస్తూ ఆకాశాన్ని కమ్ముకుంటున్నాయి. సంపెంగ పూవుల తీయని సౌరభం,తీరని కోర్కెల త్రిశూలం బ్రహ్మరాక్షసి క్రీంకణంలా తీయని, చక్కని అందెలమోత. ఉలిక్కిపడి లేచి కూర్చున్నారు చిన్నవెంకన్నదొరగారు.నిబిడాంధకారపు నిశ్శబ్దంలో దగ్గర అవుతున్న అందెలమోతలు ఆయన చెవుల త్రుప్పును వదిలించి వేసినాయి.అల్లల్లాడుతున్న దీపపుకాంతి గోడలనిండా దయ్యాలను ప్రత్యక్షం చేస్తూంది. ఊపిరి బిగబట్టి, మొండి ధైర్యానికి స్వస్తిచెప్పి గొంతుకచించుకొని, "బాపనయ్యా, రాఘవా,లోకయ్యా!" అంటూ వెర్రికేకలు వేశారు. దిక్కులు పిక్కటిల్లి గోడలు దద్దరిల్లినాయి. కాని, సమాధానంలేదు.తన కేకల ప్రతిధ్వనికి తన హృదయమే బీటలువారినట్లైంది. నిశ్శబ్దనిశీధంలో ఇంకా ఎక్కడో అందెలధ్వని చెవిత్రుప్పును వదిలిస్తూంది. వణుకుతున్న కంఠంతో గొంతుకనుండి రక్తం చిమ్మేలా మళ్లీ అరిచారు. ఆశించిన సమాధానం లేశమైనా రాలేదు. కాని ఉన్నట్టుండి, హఠాత్తుగా గాజురాళ్ల గలగలలో పిడుగు పడ్డట్టు భీషణమైన అట్టహాసం తీయని గొంతుకలో వినిపించింది. ఛెళ్లుమన్న కొరడాదెబ్బకు ఉలిక్కిపడి తిరిగి చూసినట్లు వెనుతిరిగారు. రాతిలాంటి కఱ్ఱ తలుపుకుఆనుకొని ఒకమూర్తి, అచ్చంగా నాకాలు రూపం, విలాసంగా నించుని, తనకు ఆహారం కాబోతున్న మేకపిల్లను ఆనందంతో చూసే పెద్దపులిలా, తనతోపాటు బోనులో బంధింపబడి తన ఇనుప కౌగిలిలో నలిగి ప్రాణాలు కోల్పోవడానికి సిద్ధంగాఉన్న కోడిపెట్టను బద్ధకంగాచూసే కొండచిలువలా, తృప్తిచెందే చిరునవ్వుతో కాంతివీడిన కళ్లలో చూస్తూంది. లోహపు గోళ్లతో హృదయం పెరికివేయబడుతున్నట్లు గిలగిల్లాడుతూ, కరడుగట్టిన భయంతో గొంతుక గడ్డ కట్టుకుపోయి అస్పష్టమైన గొణుగుడుతో తేరిపారి కనుగ్రుడ్లు వెలికిరాగా చూడసాగారు. విరబోసుకున్న వినీలకుంతలాలు కోపంతో బుసలుక్రక్కే కాలసర్పపు వేయిపడగల్లా విరాజిల్లుతున్నాయి. జీవంలేని కళ్లకాంతులు ఇరవైసంవత్సరాల వెనక్కువెళ్లి ఏవో వెతుకుతున్నాయి. ఎర్రని పెదాలు బిగికొన్న విచ్చుకత్తుల్లా తెరుచుకొని తనను చుంబనానికి ఆహ్వానిస్తూ, ఆ చుంబనంలోనే తనను ఖండించి ముక్కలుగా చేయడానికి సిద్ధపడుతున్నట్లనిపిస్తూంది.ఏమాత్రం బీరుపోనియౌవనపుబింకం, ఏ కామానికైతే తనచేత ఒకఘోరమైన కృత్యం చేయించిందో, ఆ కామాన్నే ఒక చావుకేకలా వెనక్కు రప్పించి భస్మీపటలం చేయడానికి సవాలు చేస్తూ ఎదురుగా ప్రదర్శిస్తూంది. ఎగురుతున్న జుల్పాలు ఆరని మంట నాలికల్లా ఎగురుతూనే ఉన్నాయి. విచ్చుకొన్న పెదాలు మూసుకోవేలేదు. పరువంలోని యవ్వనపు బింకం మృత్యుదేవతను కవ్విస్తూనే ఉంది. తెరుచుకున్న హస్తాలను విశాలంగా చాపుతూ, ఏ కౌగిలి కోసం తను ఆశించాడో ఆ కౌగిలిని పూర్తిగా ఆహ్వానిస్తూ ఆ మృత్యుమూర్తి నెమ్మది నెమ్మదిగా తనవేపు రాసాగింది.మనసులో వెయ్యి అగ్నిపర్వతాలు ఒక్కసారి బ్రద్దలైనట్లైంది. సలసల క్రాగే పశ్చాత్తాపంతో, ముప్పిరిగొన్న భయంతో వివేకం నశించిపోతూంది. మంచీ, చెడూ అనే ఆలోచనలు పూర్తిగా నశించిపోయినాయి. శరీరంలోని సర్వావయవాలకు చావు తెలివి పట్టుపడింది. ఈ భీకరమైన, ప్రతిహింసాపూరకమైన, అందంచిలికే రూపంలోని పిశాచభావాలను తప్పించుకోవడానికి దారుణమైన మరణాన్ని కూడా ఆహ్వానించసాగాయి ఆయన పంచప్రాణాలూ. క్షణక్షణానికీ ఆరూపం దగ్గర పడుతూంది. భూమిలోకి పాతుకు పోయినట్లున్న కాళ్లను ఒక్కసారిగా ఊడపెరికారు. పిశాచహస్తాల్లాగా అకోమలమైన చేతులు తన దగ్గరగా రాగానే ఒక్కటొక్క వెర్రికేకనువదిలి ఆచేతుల క్రిందుగా పిట్టలాగా దూసుకుపోయారు. ఇరవైఏళ్ల నాటి తన గుండెకన్నా కఠినంగా ఉన్న రాతి గోడకు తల ధన్‌మంటూ తగిలి చిన్నాభిన్నమైపోయింది. మెత్తని మెదడు హేయంగా,హేయంగా ఆమూర్తి కాళ్లముందు పారాడసాగింది.

ఒక్కసారి పెనుమబ్బులు మెరిసి, ఉరిమి, పిడుగులు రాల్చి మాయమైనట్లు పోయింది. ఇంతవరకూ జీవంవీడిన ఆమూర్తి కళ్లు మళ్లీ జీవంతో ప్రకాశించసాగాయి. అందమైన రూపంలో, మలిన హృదయాలకు పిశాచభావాన్ని కలిగించిన శరీరం మళ్లీ మానవత్వం దాల్చింది. ఎదురుగుండా కళ్లకుఆనుతున్న బీభత్స దృశ్యాన్ని చూసేసరికి ఆ కోమలమైన మనసు నిలవలేక ఒక చిన్న కేకవేసి ఆ మూర్తి కళ్లు తిరిగి పడబోయింది.

"మల్లీ" అంటూ పరుగు పరుగున వచ్చి ఆమెను పొదివి పట్టుకున్నాడు బాపనయ్య. "నీ చిన్నతనంలో నీ తల్లితండ్రులను క్రూరంగా చంపిన పాపాత్ముడిమీద ఎలాంటి కక్ష సాధించావు, మల్లీ" అంటూ ఆమెను బుజ్జగిస్తూ నెమ్మదిగా అవతలికి తీసుకువెళ్లాడు. భోజనం కాగానే తనిచ్చిన సారాయి మైకంలో, తమ యజమాని బాగోగులు ఆలోచించకుండా నిద్రమైకంలో పడిఉన్న జమీందారుగారి పరిచారకులను దాటుకుంటూ, కసిదీరి తేలికపడ్డ తన భార్యను జాగ్రత్తగా ఇంట్లోకి చేర్చాడు బాపనయ్య.

ఆనాటినుండి మాతృఛాయ అసలైన దయ్యాలకొంపగా పరిగణింపబడుతూ, క్షణక్షణానికీ శిథిలావస్థపొందుతూ భూగర్భంలో కలిసిపోతూంది. ★




డాక్టర్ వృత్తి చేయండి!



ఇంటిలో విరామంగా కూర్చొని ఉండేప్పుడు పోస్టల్ ట్యూషన్ద్వారా, హోమియోపతి చదువుకొని, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజి ద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము.

వివరములకు వెంటనే వ్రాయండి:

INDIAN HOMOEOPATHIC COLLEGE (A.W.P.) JULLUNDUR CITY

శ్రీ యోగాశ్రమము

పెదవాల్తేరు

విశాఖపట్టణము-3.

☞ డాక్టర్లకు సాధ్యముగాక వదలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్సచేయబడును. కుష్ఠు, బొల్లి, కేన్సర్, క్షయ, పిచ్చి, నపుంసకత్వము, సంతానములేనివారు గూడ శ్రీ యోగిగారి చికిత్సవలన సంపూర్ణ ఫలమును బడయగలరు.

వివరములు తెలియగోరువారు ఒక రూపాయి పంపవలయును.